# దక్షిణ భారత రథసారథులు

## సంపద సృష్టిలో తెలంగాణ, సాగు విప్లవంలో ఆంధ్రా

ఆర్బీఐ నివేదిక సంచలనం.. తలసరి ఆదాయంలో తెలంగాణ రికార్డు.. ఎగుమతుల్లో ఏపీ ప్రభంజనం


ఐటీ, ఫార్మాలో తెలంగాణ.. ఆక్వా, పండ్లలో ఏపీ ఆధిపత్యం.. రెండు రాష్ట్రాలు.. విభిన్న వ్యూహాలు

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్న తీరు.. ధాన్యాగారంగా తెలంగాణ, పండ్ల తోటగా ఆంధ్రప్రదేశ్

విడిపోయిన దశాబ్దం తర్వాత తెలుగు రాష్ట్రాలు దేశ ఆర్థిక పటంలో తమదైన ప్రత్యేక ముద్రను వేస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్ తాజాగా విడుదల చేసిన 'హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్ 202425' నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేసింది. రెండు రాష్ట్రాలు ఒకదానికొకటి తీసిపోని రీతిలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. అయితే, ఈ ప్రగతి ప్రస్థానంలో రెండు రాష్ట్రాలు ఎంచుకున్న మార్గాలు పూర్తిగా భిన్నంగా ఉండటం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం సేవా రంగం, పట్టణీకరణ, వాణిజ్య పంటల ద్వారా సంపదను సృష్టిస్తుండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకృతి ప్రసాదించిన వనరులు, వ్యవసాయం, మత్స్య సంపద, నౌకాశ్రయాల ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంటోంది. ఈ నివేదిక కేవలం గణాంకాల చిట్టా మాత్రమే కాదు, కోట్లాది మంది తెలుగు ప్రజల కష్టానికి, ప్రభుత్వాల విధానాలకు దర్పణం పడుతోంది.

### దేశానికి సంపదను, ఆహారాన్ని అందిస్తున్న శక్తి

దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఆర్బీఐ నివేదిక ప్రకారం, దేశంలోని ప్రధాన రాష్ట్రాల జాబితాలో 'తలసరి ఆదాయం' విషయంలో తెలంగాణ అగ్రస్థానంలో కొనసాగుతోంది. జాతీయ సగటు కంటే దాదాపు రెట్టింపు స్థాయిలో తెలంగాణ ప్రజల ఆదాయం ఉండటం రాష్ట్ర ఆర్థిక పటిష్టతకు నిదర్శనం. దీనికి ప్రధాన కారణం హైదరాబాద్ కేంద్రంగా విస్తరించిన సేవా రంగం. ఐటీ ఎగుమతులు, ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులు, బయోటెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ప్రపంచ స్థాయి హబ్‌గా మారింది. సేవా రంగం అందించిన దన్నుతో రాష్ట్ర సొంత పన్నుల రాబడి గణనీయంగా పెరిగింది, ఇది ప్రభుత్వానికి సంక్షేమ పథకాలు, భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి వెసులుబాటు కల్పించింది. తాజా గణాంకాల ప్రకారం, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 3,47,299కి చేరింది. ఇది జాతీయ సగటు కంటే చాలా ఎక్కువ కావడం విశేషం. దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా తెలంగాణ అవతరించడం ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు నిదర్శనం. రాష్ట్ర స్థూల ఉత్పత్తి కూడా సుమారు రూ. 14.64 లక్షల కోట్లకు చేరి బలమైన ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని నిలబెట్టింది. ఆర్థికాభివృద్ధితో పాటు ఉత్పాదక రంగంలోనూ తెలంగాణ సత్తా చాటుతోంది. ముఖ్యంగా మాంసం ఉత్పత్తిలో 10.15 లక్షల టన్నుల ఉత్పత్తితో దేశంలోనే నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా గొర్రెల పెంపకందారులకు దక్కిన భారీ విజయం. వ్యవసాయ రంగంలోనూ తెలంగాణ అద్భుత ప్రగతిని కనబరుస్తోంది. ఒకప్పుడు నీటి కష్టాలతో ఉన్న నేలలు కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల పుణ్యమా అని సస్యశ్యామలమయ్యాయి. ఫలితంగా రాష్ట్రంలో ఏటా సుమారు 2.6 కోట్ల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అవుతోంది. పంజాబ్ తర్వాత దేశానికి అన్నం పెట్టే రెండో అతిపెద్ద రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. అలాగే దాదాపు 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తూ, దేశీయ టెక్స్‌టైల్ రంగానికి అవసరమైన నాణ్యమైన పత్తిని అందించడంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. మరోవైపు హైదరాబాద్ కేంద్రంగా ఐటీ ఎగుమతులు రూ. 2.41 లక్షల కోట్లకు చేరడం, సేవా రంగం ద్వారా రాష్ట్రానికి భారీ ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఒకప్పుడు కరువు ప్రాంతంగా పేరున్న తెలంగాణ నేడు వ్యవసాయ రంగంలో అద్భుతాలు సృష్టిస్తోంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు వంటి పథకాల వల్ల సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. ఫలితంగా, పంజాబ్ తరువాత దేశంలోనే అత్యధిక వరి ధాన్యం సేకరించే రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. కేవలం వరి మాత్రమే కాకుండా, పత్తి ఉత్పత్తిలోనూ తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉంటూ జాతీయ టెక్స్‌టైల్ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఇక పశుసంపద విషయానికి వస్తే, 'పింక్ రివల్యూషన్'లో భాగంగా మాంసం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. గొర్రెల పెంపకంలో దేశంలోనే అతిపెద్ద వ్యవస్థను కలిగి ఉండి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది.




### ప్రకృతి వనరులే పెట్టుబడి.. సాగులో స్వర్ణయుగం

మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ఆర్బీఐ తాజా గణాంకాల ప్రకారం 202425లో ఏపీ ఏకంగా 1.93 కోట్ల టన్నుల పండ్లను ఉత్పత్తి చేసి దేశంలోనే నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుంది. మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ, బత్తాయి వంటి పండ్ల తోటల సాగులో ఏపీ రైతులు సాధిస్తున్న దిగుబడులు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉన్నాయి. ఈ కారణంగా రాష్ట్రాన్ని 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణిస్తున్నారు. పండ్లతో పాటు సుగంధ ద్రవ్యాలైన మిరప ఉత్పత్తిలోనూ గుంటూరు మిర్చికి ఉన్న అంతర్జాతీయ డిమాండ్‌తో ఏపీ అగ్రస్థానాన్ని కాపాడుకుంటోంది. పామాయిల్ సాగులోనూ రాష్ట్రం అగ్రగామిగా ఉంటూ వంట నూనెల దిగుమతులను తగ్గించడంలో దేశానికి సాయపడుతోంది. ఏపీకి ఉన్న అతిపెద్ద బలం దాని 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం. దీన్ని సంపూర్ణంగా వినియోగించుకోవడం వల్ల మత్స్య రంగంలో ఏపీ తిరుగులేని శక్తిగా ఎదిగింది. దేశం నుంచి ఎగుమతి అవుతున్న రొయ్యలు, చేపల్లో దాదాపు 70 శాతం వాటా ఆంధ్రప్రదేశ్‌దే కావడం విశేషం. 51.58 లక్షల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తితో లక్షల మందికి ఉపాధి లభించడమే కాకుండా, రాష్ట్రానికి భారీగా విదేశీ మారకద్రవ్యం లభిస్తోంది. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నట్లుగా, ఈ రికార్డులు రాష్ట్ర ప్రభుత్వ పాలన దక్షతకు నిదర్శనం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.15.93 లక్షల కోట్లకు చేరడం, ఆరోగ్య రంగంలో ప్రజల సగటు ఆయుష్షు 70 ఏళ్లుగా ఉండటం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో మెరుగైన ర్యాంకు సాధించడం ఏపీ సమగ్ర అభివృద్ధిని సూచిస్తోంది.

### ముగింపు: జాతీయ వృద్ధిలో తెలుగు సంతకం

ఈ గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే రెండు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వస్తాయి. తెలంగాణ రాష్ట్రం 'అర్బన్‌సర్వీస్‌ఇరిగేషన్' (పట్టణసేవాసాగునీటి) నమూనాతో నగరాల ఆదాయాన్ని గ్రామీణ అభివృద్ధికి మళ్లిస్తూ ముందుకు సాగుతుంటే, ఆంధ్రప్రదేశ్ 'కోస్టల్‌అగ్రిఎక్స్ పోర్ట్' (తీరప్రాంతవ్యవసాయఎగుమతి) నమూనాతో ప్రకృతి వనరుల ద్వారా సంపదను సృష్టిస్తోంది. మౌలిక వసతుల కల్పనలో రెండు రాష్ట్రాలు పోటీపడుతున్నాయి. తెలంగాణలో ఓఆర్ఆర్, మెట్రో వంటి ప్రాజెక్టులు వేగాన్ని పెంచితే, ఆంధ్రప్రదేశల్ కొత్త పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో సాగరమాల లక్ష్యాలను చేరుకుంటోంది. మొత్తంగా చూస్తే, వ్యవసాయం, ఐటీ, ఫార్మా, మత్స్య రంగాల్లో తెలుగు రాష్ట్రాలు సాధిస్తున్న ప్రగతి భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యానికి ఊపిరి పోస్తోందనడంలో ఎటువంటి సందేహం లేదు.

- గడల నరసింహా, సీనియర్ జర్నలిస్ట్



# చాయ్ చమక్కులే చూడరా భాయ్...

ప్రపంచ మానవాళికి తేయాకు కార్మికులు చేస్తున్న సేవకూ, వారి సమస్యలను సమాజం దృష్టికి తేవడానికి 2005 సంవత్సరం డిసెంబర్ 15వ తేదీన కొత్త ఢిల్లీలో జరిగిన సమావేశ సందర్భాన్ని పురస్కరించుకుని 2006 సంవత్సరం నుండి అంతర్జాతీయ తేనీటి దినోత్సవాన్ని డిసెంబర్ 15న నిర్వహిస్తున్నారు.తేనీటి ఉత్పత్తిదేశాల్లో చిన్న తేయాకు ఉత్పత్తిదారుల హక్కులు, సంక్షేమం గురించి ఆలోచించడానికి, కార్యాచరణ రూపొందించు కోవడానికి అంతర్జాతీయ తేయాకు దినోత్సవం ఒక సందర్భం.మంచినీటి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది తాగుతున్నది టీనే. ముఖ్యంగా మనదేశంలో టీ లవర్స్ కోట్లలో ఉన్నారు. పైగా, మన దేశం నుంచి చాలా దేశాలకు టీ ఎగుమతి అవుతోంది. అసోం, డార్జిలింగ్ టీలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది.తేయాకు కార్మికుల సంక్షేమం కోసం నిర్వహించబడ్డ పలు సమావేశాల్లో వివిధ దేశాలు చిన్నతరహా తేయాకు పెంపకందార్లు మరియు తేయాకు కార్మికులకోసం రూపొందించబడిన విధివిధానాలను అమలు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశాయి. తేయాకు తోటల్లో శ్రామికులు ప్రధానంగా మహిళా కార్మికులు. వారి వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత, కార్మిక హక్కులు, వృత్తిపరమైన భద్రతతో పాటు ఆరోగ్యం వంటి అంశాలన్నీ ఇందులో ఇమిడి ఉన్నాయి.

టీని మొదటిసారిగా క్రీస్తుపూరం 2737లో చైనా చక్రవర్తి షెన్ నంగ్ కనిపెట్టారు. ఆయన తాగే వేడి నీటి గిన్నెలో ఓ తేయాకు అనుకోకుండా పడింది. దాని నుంచీ వచ్చిన టేస్ట్ ఆయనకు నచ్చడంతో టీ పుట్టుకొచ్చింది.1908లో టీ బ్యాగుల వాడకం అమెరికాలో మొదలైంది. థామస్ సల్లివాన్ తన కంపెనీ టీ పొడిని టేస్ట్ చూడమని ప్రజలకు చిన్న బ్యాగుల్లో ఇచ్చాడు. ప్రజలు వాటిని వేడి నీటిలో ముంచి తాగారు. అలా టీ బ్యాగ్స్ పుట్టుకొచ్చాయి. అత్యధికంగా తేయాకు ఉత్పత్తి చేసే తొలి పది దేశాలుచైనా, భారత్, కెన్యా, శ్రీలంక, టర్కీ, వియత్నాం, ఇరాన్, ఇండోనేషియా, అర్జెంటీనా, జపాన్.భారత దేశంలో అసోమ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లో తేయాకు అత్యధికంగా ఉత్పత్తి చేస్తారు. భారత్‌తో పాటు తెలంగాణలో కూడా వివిధ రకాల టీలను సేవిస్తున్నారు. ఇరానీ, అస్సాం, ఫ్లేవర్, చాక్‌లెట్, మసాలా, హెర్బల్, ఇలాచీ, బిస్కెట్ అందుబాటులో ఉన్నాయి. ఒక్కోరకం టీకి ఒక్కోరకం ప్రత్యేకత ఉంటుంది. మన దగ్గర తేయాకు పండినా మనకు దాన్ని తాగడం అలవాటు చేసింది ఇంగ్లీష్‌వాళ్లే! ఇంగ్లీష్‌వాళ్లకు పోర్చుగీస్‌వాళ్లు పరిచయం చేశారు. పోర్చుగీస్‌వాళ్లు (మతగురువులు) 16వ శతాబ్దంలో చైనానుంచి నేర్చుకున్నారు.స్వాతంత్ర్యం తర్వాతే మన దేశంలో టీ అధిక ప్రజాదరణ పొందింది. ఇండియాలో టీని పాలు, తేనె, వెనీలా, అల్లం, లవంగాలు, యాలకులు ఇలా రకరకాల పదార్థాలు, సుగంధ ద్రవ్యాలతో తయారుచేస్తున్నారు.మన టీ పరిశ్రమ ఉత్పత్తులు ప్రస్తుతం ప్రపంచ ఉత్పత్తులలో 31శాతం ఉండగా, ఎగుమతుల్లో దేశం నాల్గవస్థానంలో ఉంది. గత కొన్ని దశాబ్దాలుగా, భారతదేశం యొక్క స్థూల జాతీయోత్పత్తి వృద్ధిలో, విదేశీ మారక ద్రవ్య ఆదాయంలో టీ పరిశ్రమ చాలా కీలక పాత్ర పోషించడం గమనార్హం. భారతదేశంలో ఉత్పత్తి అయ్యే టీ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా 140 దేశాలకు ఎగుమతి చేయబడతాయి.తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులకు గృహవసతి కల్పించడం,తేయాకు కార్మికుల వేతనాల పెరుగుదల యజమానుల ఇష్టానుసారంగా కాకుండా హేతుబద్ధంగా ఉండం,పరిసరాల శుభ్రత, శుభ్రమైన తాగునీరు,ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన ఇతర వసతులు సమకూర్చడం యాజమాన్యాల కనీస బాధ్యతగా గుర్తించాలి.గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో పనిచేసే తేయాకు కార్మికులకు వైద్య సౌకర్యం కల్పించాలి.తేయాకు కార్మికుల్లో సగానికిపైగా మహిళలేకావడంతో సంతానం వారితోనే ఉంటారు.టీ ఎస్టేట్లు ఆవాస ప్రాంతాలకు దూరంగాఉండటంవల్ల పిల్లలు విద్యకు నోచుకోవడంలేదు. మనకు సేదదీర్చే తేనీరు, తేయాకు సాగు వెనక ఇన్నిన్ని కష్టాలున్నాయి. ఈ రోజు తేయాకు కార్మికుల గురించి ఆలోచిద్దాం.

- పిన్నింటి బాలాజీరావు,
హనుమకొండ, 9866776286



# రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు,ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999


# సామాన్యులకు దడ పుట్టిస్తున్న గుండె జబ్బులు

చలి కాలం రాష్ట్రం లో చలి పంజా విసురుతుంది. ఇటీవల కాలంలో ఏ నోట విన్నా గుండె పోటు తో మరణించి నట్లు నిత్యం పత్రికలలో వార్తలు వస్తున్నాయి. చిన్న తనం లోనే గుండె పోటు కి గురి అయి మరణించే వారి సంఖ్య అధికంగా వుంటుంది.పట్టుమని 20 యేళ్లు నిండనీ వారు కూడా మృత్యువు గుండె పోటు రూపం లో కబలిస్తోవుంది.నిత్యం వ్యాయామం,యోగ చేస్తూ,ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ,మితా ఆహారం తీసుకుని ,డిప్రెషన్ కి దూరం గా వున్న గుండె పోటు తప్పడం లేదని సర్వేలు వెల్లడిస్తున్నాయి.రాబోయే రోజులలో మన దేశం లో గుండె పోటు మరణాలు అధికంగా ఉంటాయి అని సాక్షాత్తు ఆరోగ్య నిపుణులు అంటున్నారు హృదయ దినోత్సవం ను ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు వరల్డ్ హార్ట్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తాయి. గుండెపోటు, గుండెజబ్బులను నివారించడానికి 1946లో జెనీవాలో వరల్డ్ హార్ట్ ఫౌండేషన్ సంస్థ ఏర్పాటయ్యింది. 2000 సంవత్సరం నుండి ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ నెల ఆఖరి ఆదివారం నిర్వహించబడిన ప్రపంచ హృదయ దినోత్సవం 2011 సంవత్సరం నుండి సెప్టెంబర్ 29వ తేదీననిర్వహించబడుతుంది. గుండెజబ్బు అనేది నేడు సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద అనారోగ్య సమస్య. గతంలో కేవలం వృద్ధులకు మాత్రమే వచ్చే గుండెజబ్బులు నేడు యుక్తవయస్కుల్లో కూడా రావడం ఆందోళనకర పరిణామం. అత్యంత ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్నప్పటికీ ఎక్కువమంది మరణిస్తున్నది గుండె జబ్బుతోనే. ప్రపంచవ్యాప్తంగా సగటున సంవత్సరానికి ఒక కోటీ డెబ్బైఐదులక్షల మంది అంటే 39 శాతం మరణాలు సంభవిస్తున్నవి అని చెప్పవచ్చు.



### గుండె జబ్బులతోనే...

ఈసంఖ్యను 2030 వరకు 25 శాతం తగ్గించడం లక్ష్యంగా ప్రపంచ హృదయ సంస్థ కృషిచేస్తున్నది. గుండెవ్యాధికి అనారోగ్య సమస్యలు, వైద్యపరమైన కారణాల కన్నా సామాజిక, మానసిక సమస్యలు ప్రధాన కారణం. ఒత్తిడికి లోనవడం, మానసిక పరంగా డిప్రెషన్ కు లోను కావడం, చిన్న సమస్యలను పెద్దగా తీసుకోవడం, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, శాఖాహారం తగ్గించి మాంసాహారం ఎక్కువగా తినడం, ఉప్పు, కారం, మసాలాలు,నూనెలు అధికంగా తినడం, బాల్యం నుండే జంక్ ఫుడ్ కు అలవాటు పడటం వంటి కారణాల వల్ల నేడు గుండె జబ్బులు అధికంగా రావడానికి కారణం అవుతున్నాయనీ డాక్టర్స్ అంటూ వున్నారు.తలిదండ్రులు పిల్లల ఆటలు, వినోదానికీ సరిగా సమయం కేటాయించలేక , మొబైళ్ళు, కంప్యూటర్ వంటి డిజిటల్ ఉపకరణాలతో కాలక్షేపం చేయిస్తున్నారు. ఇక స్కూళ్లలో ఆటస్థలాలే లేకుండా, ఆటల్లేకుండా బాల్యంనుండి యవ్వనంలోకి అడుగిడుతూ యుక్తవయసుకొచ్చేసరికి శరీరం, కండరాలకు తగినంత శక్తి లేకపోవడంతో 2025 ఏళ్లకే మధుమేహం, హైబీపీల బారిన పడుతున్నారు. వ్యాహ్యాళికీ, వాకింగ్‌కీ వసతుల్లేని పార్కులూ, ఆటస్థలం లేని స్కూళ్లు. ఆడించని పాఠశాలలు ఇవన్నీ అనారోగ్యానికి హేతువులు. నేటి బాలలు రేపటి భావి భారత పౌరులకు' బదులుగా 'నేటి బాలలే రేపటి రోగులుగా' తయారవుతున్నారు. దానికి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.బాల్యం నుండే విద్యార్థులకు ఆహారము, వ్యాయామము,విలువలతో కూడిన విద్య, ఒత్తిడిలేని విద్యపై అవగాహనను ఏర్పరచాలి. ఏ వయసు వారైనా వాకింగ్, యోగ, ప్రాణాయామము,ధ్యానము, వ్యాయామం చేయడం, మానసిక ఉల్లాసం కలిగించే సంగీతము, కళలు, పుస్తకాలు చదవడం వంటివి అలవర్చుకోవాలి. ఇవన్నీ సమస్యలో సమగ్ర భాగం. మన ఆరోగ్యానికి మంచి ఆహారమేమిటో మనందరికీ తెలుసు. సరదా, కాలక్షేపాలకోసం మనతొపాటు పిల్లలకు సైతం జంక్‌ఫుడ్ తినిపిస్తున్నాం. కూల్‌డ్రింక్‌లతో జరిగే నష్టం తెలిసీ ప్రసార మాధ్యమాలమోజులో తాగిస్తున్నాం. బాల్యంలోనే వికృత రుచులకు అల్వాటు అనేకంటే బానిసలై ప్రకృతి రుచులను మరచిపోతున్నారు. వయసుతోపాటే రోగాల తాకిడీ పెరుగుతున్నది. మాంసాహారాన్ని త్యజిస్తే గొప్ప వ్యత్యాసం తెలుస్తుంది. మాంసాహారులకంటే శాఖాహారులు తక్కువ బరువుతో ఉంటారు. శాఖాహారుల్లొ గుండెవ్యాధుల ప్రమాదం 40% తక్కువగానుండటంవల్ల మరో ఏడేళ్ళపాటు ఆదనంగానూ, ఆరోగ్యంగానూ జీవిస్తారు. వ్యాయామ అవసరమెంతో తెలుసు. వ్యక్తులతోపాటు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం.

### యోగ, శారీరక వ్యాయామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఈమధ్య కాలాల్లో 'యోగా'ను పెద్దఎత్తున ప్రోత్సాహించారు. ప్రభుత్వాలనుండి, సమాజంనుండీ విధానపరమైన ప్రోత్సాహం ఉంటున్నంది.ఉదయాన్నే లేచి సూర్యకిరణాలు చూస్తూ కొంత వ్యాయామం చెయడం శరీరానికి, మనసుకి కనీసావసరం. యోగధ్యానము ప్రాణాయామము వంటివాటిని మత విశ్వాసానికి సంబంధించిందని కొందరు భావించడం వారి సంకుచిత మనస్తత్వం తెలియజేస్తుంది. నిజానికి యోగా కాణీ ఖర్చులేని సంపూర్ణ ఆరోగ్య జీవన విధానం. వయసుతో నిమిత్తంలేకుండా శరీరం కండరాలు అనుమతించినంతరకు ఆసనాలు వేయవచ్చు. యోగా ధ్యానాలతో కండలు పెరగకపోయినా శారీరక ధృడత్వం, మానసిక స్థిరత్వం పెరుగుతాయి. ప్రపంచ యోగా దినోత్సవం జూన్ 21 తేదీన నిర్వహించుకోవడం యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవడానికి అన్ని దేశాలనుండి పెద్ద మద్దతు వచ్చింది.

### ధూమపానం, మద్యపానాలు త్యజించాలి

ధూమ పానం, మద్యపానాలు వల్ల కూడా చాలా మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు వీటితోసంక్రమించేకేన్సర్,మధుమేహం,పక్షవాతం గుండెజబ్బుకు ఆదనపు మద్దతునిస్తాయి. ఈఅలవాట్లను విసర్జించడానికి కావలసింది మానసిక స్థైర్యం. సాంప్రదాయిక అలవాట్లు, ఆహార విధానాలకు దూరమై తిరోగమన పద్ధతులకు చేరువయ్యాం. కావున ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకుని మానసికంగా శారీరకంగా సామాజికంగా దూరంగా ఉండి సరైన ఆహార నియమాలు పాటిస్తూ యోగా ప్రాణాయామము వ్యాయామాలు చేస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవన విధానంతో గుండెజబ్బులను దరిచేరనీయకుండా చూసుకోవచ్చు. ప్రతి ఒక్క పౌరుడు తగు జాగ్రత్తలు పాటిస్తూ హృదయం పదిల పరుచుకొని గుండెపోటు ముప్పు నుంచి తమను తాము రక్షించుకుంటారని ఆశిద్దాం.

- కామిడి సతీష్ రెడ్డీ,
జయశంకర్ భూపాలపల్లి జిల్లా.తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు
9848445134





# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి .. యాచారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే

### ప్రజలలో అనునిత్యం ఉండే వారిని గెలిపించాలి.. ఫ్యూచర్ సిటీతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మూడవ విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం చివరి రోజు జోరుగా సాగింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజక వర్గం యాచారం మండలంలోని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల తరఫున ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రచారం చేశారు. మండలంలోని గునగల్, చౌదరిపల్లి, చింతుల్ల, నందివనపర్తి, సింగారం, యాచారం గ్రామాల్లో ఎమ్మెల్యే రంగారెడ్డి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామం మరింత అభివృద్ధి జరుగుతుందని, ఇండ్లు లేని పేదలకు ఇండ్లు, అర్హులైన వారికి పెన్షన్లు, రేషన్ కార్డ్, ఉచిత విద్యుత్, డ్వాక్రా గ్రూప్ మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేస్తూ, మహిళల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దోహదపడుతుందని, మహిళలు ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అనునిత్యం పాటుపడుతున్నారని, భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధి, మరిన్ని సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

**ప్రజల అభివృద్ధి కోసమే కాంగ్రెస్...**

గత పది సంవత్సరాలుగా పాలించిన పాలకులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో వదిలేసి తమ స్వలాభం కోసం రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో ప్రజా పాలనలో భాగంగా ప్రజల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అనేక సంక్షేమ పథకాలు తీసుకురావడంతో ప్రజా సమస్యలు ఒక్కొక్కటిగా నెరవేర్చడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. మీ గ్రామాల్లో ప్రతినిత్యం ఉంటూ సమస్యలు తెలుసుకొని అభివృద్ధికి పాటుపడే వారికి ఓటును వేసి గెలిపించుకోవాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా చేయడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే రంగా రెడ్డి అన్నారు.

**ఫ్యూచర్ సిటీతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి...**

యాచారం మండలం ఫ్యూచర్ సిటీలో ఉండడం, ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.. ఈ ప్రాంతంలో ఎవరు కూడా భూములను అమ్ముకోవద్దని ఆయన ప్రజలకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఫ్యూచర్ సిటీతో రాష్ట్రం మరింత అభివృద్ధి కాబోతుంది తెలిపారు..

## గెలుపు ప్రజాపాలనకు నిదర్శనం



**ఆమనగల్లు, మహా:** సర్పంచ్‌లుగా కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించడం తమ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజాపాలనకు నిదర్శనమని టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.కడ్తాల్ మండలం సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పాలకవర్గాలను ఆయన సన్మానించి మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుండగా, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. సర్పంచ్‌లు, పాలకవర్గాలు గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. వివాదాలకు తావు లేకుండా సమన్వయంతో వ్యవహరిస్తూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నిజాయితీతో పని చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కర్ణాకర్ గౌడ్, రవికాంత్,సుమన్, మధు, నరేష్,తదితరులు ఉన్నారు.

## బాబోయ్ వీధి కుక్కలు..

- గ్రేటర్ వరంగల్ లో వృద్ధురాలిపై వీధి కుక్కల దాడి
- ప్రాణం పోతున్నా పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- లక్షల్లో బడ్జెట్ తూతూ మంత్రంగా చర్యలు



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళన కు గురి చేయడమే కాకుండా ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయి. నగరం లోని 66 డివిజన్ల లోని అన్ని కాలనీలలో ఈ వీధి కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేతెత్తుతున్నారు. రాత్రి సమయాలలో సైతం రోడ్లపైకి వచ్చి నడుచుకుంటూ వేళ్లే వారి పై అలాగే వాహనదారుల పై వీధి కుక్కలు దాడులకు పాల్పడుతుండడంతో నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బల్దియా పరిధిలో గతంలో ఓ ఉద్యోగి తో పాటు చిన్నారులు వీధి కుక్కల దాడి లో ప్రాణాలు కోల్పోయిన, ఎంతోమంది గాయాల పాలైన సంబంధిత మున్సిపల్ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

**నామమాత్రంగా చర్యలు..**

గ్రేటర్ వరంగల్ నగరంలో వీధి కుక్కల నిర్మూలనకు లక్షల్లో ఖర్చు చేస్తున్నామని బల్దియా పెద్దలు చెబుతున్న ఇందుకు భిన్నంగా అధికారుల చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. నిత్యం ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందిన మున్సిపల్ అధికారులు మాత్రం వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడలేక పోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎప్పుడో ఒక్కసారి వీధి కుక్కలను పట్టుకోని పోయి అనంతరం చేతులు దులుపుకోవడం మున్సిపల్ అధికారుల వంతుగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీధి కుక్కల స్వైర విహారంపై స్పందించి నివారణకు చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

**వీధి కుక్కలతో ప్రాణాలకు ప్రమాదం**

గ్రేటర్ వరంగల్ నగరంలో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగింది. గతంలో పలు కాలనీలలో చిన్నారుల పై వీధి కుక్కలు దాడులు చేసి గాయాలు చేసిన సంఘటనలు నగరంలో అనేకం ఉన్నాయి. వరంగల్ నగరం లోని ఖిలా వరంగల్ మండలం 40వ డివిజన్ లోని ఉర్సు ప్రాంతంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. సోమవారం పిచ్చి కుక్క దాడిలో చిన్నారి తో పాటు వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి బాధితులను 108 అంబులెన్స్ లో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వీధి కుక్కల సమస్యపై మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో మారు పెద్ద ప్రమాదం చోటు చేసుకోక ముందే మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను బెడద నుంచి ప్రజలను కాపాడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటిన కొండా వర్గం



**వరంగల్ మహా;** కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు వర్గం స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా కొండా మురళిధర్ రావు తన మాటను నిలబెట్టుకున్నారు. తాను ఇచ్చిన మాట ప్రకారం తన సొంత మండలం గీసుగొండ లో కొండా వర్గం ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచుల ను, వార్డ్ మెంబర్ల ను కొండా మురళి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత చిప్ప వెంకటేశ్వర్లు, 28వ డివిజన్ ప్రెసిడెంట్ కె. సంపత్ కుమార్, ముఖ్య నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓలకు సహకరించని వారిపై చర్యలు

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

- మొదటి రెండవ పోలింగుకు గైర్హాజరైన సిబ్బందిపై వేటు
- మూడో విడత ఎన్నికల అధికారులకు శిక్షణ
- నేడు పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారులు
- జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద కట్టదుటమైన ఏర్పాట్లు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా సోమవారం పోలింగ్ సిబ్బందిని నియమించుట కొరకై మూడవ విడతలో మూడవ ర్యాండమైజెషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమక్షంలో పూర్తి చేశారు. సోమవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ మూడవ విడతలో మూడవ ర్యాండమైజెషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో నిర్వహించే మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4977 ప్రిసైడింగ్, అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి మరియు రెండోవ విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు. మూడవ విడత పోలింగ్ సిబ్బందికి నేడు వారికి కేటాయించిన మండల కేంద్రాలలో మూడవ విడత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, శిక్షణ అనంతరం వారికి ఎన్నికల సామగ్రి, పోలింగ్ మెటీరియల్ పంపిణీచేసి వారిని ప్రత్యేక వాహనంలో పోలీస్ రక్షణ తో పోలింగ్కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని అని కలెక్టర్ హెచ్చరించారు.

**గైర్హాజరైన ఎన్నికల సిబ్బందిపై చర్యలు!....**

మొదటి విడత, రెండవ విడతలలో 125 మందికి పైగా పోలింగ్ సిబ్బంది విధులకు గైర్హాజరు అయినారని, ఇంకొంత మంది సిబ్బంది విధులకు హాజరై రిజిస్టర్ లో సంతకాలు చేసి ఎన్నికల విధులకు హాజరు కాకుండా ఎంపీడీవోలకు సహకరించలేదని, వీరందరి పై కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మూడవ విడతలో కూడా ఎవరైనా గైర్హాజరైనా, హాజరు అయి ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా ఉంటే సస్పెండ్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్,(లోకల్ బాడీస్) డీపిఓ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ కు వెల్లువెత్తిన ఫిర్యాదులు

- ఫిర్యాదుల పరిష్కారం కోసమే ప్రజావాణి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ మహా;** ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించడంలో ఎటువంటి అలసత్వం వహించకుండా త్వరతగతిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్)కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదులు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్.....63, ఇంజనీరింగ్..... 41, రెవేన్యూ.........04, హెల్త్ శానిటేషన్....03, నీటి సరఫరా....05, హార్టికల్టర్....01, మొత్తం =117 గా అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, బిర్రు శ్రీనివాస్ ,టి ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు




**హన్మకొండ మహా;** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల నిర్వహణలో భాగంగా ఈ నెల 17వ తేదీన వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల పరిధిలో జరిగే మూడవ విడత గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్. ఎస్ సి. ఆర్. పిసి 163 ప్రకారం(144 సెక్షన్) ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులు గా చేరడం నిషేధించడం జరిగింది. ఈ నిషేధం రేపు అనగా 16వ తేది ఉదయం 6 గంటల నుండి 17 తేదీ రాత్రి 8 గంటల వరకు అమలులో వుంటుందని తెలిపారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ హెచ్చరించారు.

## నాగారం గడ్డమీద గులాబీ జెండా

### భారీ ఆధిక్యంతో సర్పంచ్ గా నెగ్గిన ఎరుకొండ రమాదేవి శ్రీనివాస్.. గ్రామంలో మిన్నంటిన సంబరాలు..

### ప్రజలకు మండల అధ్యక్షులు చింతి రెడ్డి మధుసూదన్ రెడ్డి ధన్యవాదాలు



**పరకాల మహా:** హనుమకొండ జిల్లా పరకాల మండలం నాగారం గ్రామ సర్పంచ్‌గా బీఆర్ఎస్ మద్దతుదారులు విజయం సాధించారు. పరకాల మండలంలోని నాగారం గ్రామాన్నిబీఆర్ఎస్ భారీ ఆధిక్యంతో కైవసం చేసుకుంది. నాగారం గ్రామ సర్పంచ్‌గా బీఆర్ఎస్ మద్దతుదారులు ఎరుకొండ రమాదేవి శ్రీనివాస్ కాంగ్రెస్ మద్దతు దారుడు పై 601 ఓట్ల తేడాతో గెలుపొందారు. దీంతో గ్రామంలో సంబురాలు మిన్నంటాయి. తనను ఎన్నుకున్న ప్రజలకు సర్పంచ్ రమాదేవి శ్రీనివాస్, పార్టీపై నమ్మకం ఉంచిన ప్రజలకు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూధన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ విజయంతో గ్రామంలో సంబురాలు మిన్నంటాయి.

## పరకాలలో శక్తి మిల్క్ పార్లర్ ప్రారంభించిన నాగుర్ల



**పరకాల, మహా:** పరకాల పట్టణ కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా శక్తి పార్లర్ ను టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రస్థాయి నాయకులు, రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. శక్తి డైరీ ఏజెంట్ తీసుకొని పార్లర్ ప్రారంభిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా డైరీ ఏరియా మేనేజర్ సురేష్ మాట్లాడుతూ పరకాల పట్టణ కేంద్రంలో శక్తి మిల్క్ పార్లర్ ను ప్రారంభించడం జరిగిందని, పరకాల చుట్టు పక్కల గ్రామాలకు నాణ్యమైన శక్తి పాలు మరియు పాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని అన్నారు.ఇలాంటి పార్లర్ లతో డైరీ విస్తృత పరచడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మెన్ గందె వెంకటేశ్వర్లు వరికెల కిషన్ రావు బాదర్ గాని రాకేష్డైరీ సిబ్బంది అశోక్, సాగర్, ఓదెలు పాల్గొన్నారు.

## శంషాబాద్‌ను నాలుగు డివిజన్‌లుగా విభజించాలి

### బీజేపీ నాయకులు కమిషనర్‌కి వినతిపత్రం అందజేత




**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ ను నాలుగు డివిజన్లుగా విభజించాలి. విభజించిన డివిజన్లను రాజేంద్రనగర్ జోన్లో కలపాలని శంషాబాద్ సర్కిల్ బిజెపి నాయకులు సర్కిల్ జిహెచ్ఎంసి కమిషనర్ సుమన్ రావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. శంషాబాద్ సర్కిల్ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటు ఉండాలంటే శంషాబాద్ సర్కిల్ ను రాజేంద్రనగర్ జోన్ లో కలపాలి. శంషాబాద్ ను నాలుగు డివిజన్లుగా విభజించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. చార్మినార్ జోన్ లో కలపడని శంషాబాద్ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండాలంటే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన శంషాబాద్ సర్కిల్ ను రాజేంద్ర నగర్ జోన్ లో కలపాలన్నారు. నగరంలో ఎంఐఎం పార్టీకి సంబంధించిన జనాభా 15000 తో డివిజన్లు ఏర్పాటు చేశారు. శంషాబాద్ సర్కిల్ లో దాదాపు 60 వేల ఓటర్లు, దాదాపు ఇక్కడి జనాభా లక్షకు పెరగడానికి ఆస్కారం ఉంది. జనాభా పెరుగుదల దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే శంషాబాద్ ను నాలుగు డివిజన్లుగా విభజించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ ,శంషాబాద్ మండల్ అధ్యక్షులు మల్రెడ్డి ప్రశాంత్ రెడ్డి,చింతల్ నందకిషోర్,బాత్కు శ్రీనివాస్ యాదవ్, రాహుల్ అప్పా ,రాజీ రెడ్డి ,కొండ ప్రవీణ్ ,భాష్కర్ రెడ్డి ,జితేందర్ ,వినయ్ గౌడ్, జీవన్ రెడ్డి ,రవీందర్, భోజి రెడ్డి ,శ్రీనాథ్ ,నరేందర్ ,మహిపాల్ రెడ్డి,నాని,అశోక్ ,లింగం స్వామి,సురేష్ ,శివ,కొప్పుల ప్రశాంత్ ,శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూపాయికి ఏమైంది??
# మళ్లీ రికార్డ్ పతనం

భారత రూపాయి విలువ మళ్లీ పతనాన్ని చూసింది. సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ .90.57 వద్ద తాజా రికార్డు కనిష్టానికి పడిపోయింది. శుక్రవారం ముగిసిన రూ .90.41 తో పోలిస్తే భారత కరెన్సీ 14 పైసలు తగ్గింది. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, నిరంతర విదేశీ నిధుల ప్రవాహంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతిన్న కారణంగా గత శుక్రవారం కూడా డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 17 పైసలు క్షీణించి 90.49 వద్ద ముగిసింది.

### రూపాయి పతనానికి ముఖ్యమైన కారణాలు

యూఎస్‌భారత్ వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ఇప్పటివరకు అమెరికా తో వ్యాపార ఒప్పందం పై స్పష్టత రావకపోవడంతో పెట్టుబడిదారుల్లో చాలా అనిశ్చితి నెలకొంది. అత్యధిక టారిఫ్స్, ఒప్పందం ఆలస్యంతో డాలర్‌డిమాండ్ పెరిగింది.

### విదేశీ నిధుల అవుట్‌ఫ్లో


వివిధకాలపు విదేశీ పెట్టుబడి సంస్థలు భారత మార్కెట్ల నుండి పెద్దగా నిధులు ఉపసంహరించుకోవడంతో రూపాయి పనితీరు మీద ఒత్తిడి పెరిగింది. ఈ అవుట్‌ఫ్లోల కారణంగా డాలర్ డిమాండ్ పెరిగి రూపాయి విలువ తగ్గడం జరిగింది.

### భారీ దిగుమతులు

భారతదేశంలో క్రూడ్ ఆయిల్, ఇతర దిగుమతులు పెరగడం కూడా డాలర్ డిమాండ్‌కు కారణమైంది. ముఖ్యంగా ద్రవ్యమార్కెట్‌లో సరిపడా డాలర్లు లేనప్పుడు సహజంగా రూపాయిపై ఒత్తిడి పెరుగుతుంది.



# వెండి @ రూ.2.40 లక్షలు




బంగారం ధర రూ. 1.30 లక్షలు (24 క్యారెట్స్ 10 గ్రామ్స్) దాటితే.. కేజీ వెండి రేటు రూ. 2.13 లక్షలకు చేరింది. సిల్వర్ రేటు మరింత పెరిగి 2026కు సుమారు రూ. 2.40 లక్షలకు చేరుకుంటుందని స్టాక్ బ్రోకర్ అండ్ ఇన్వెస్ట్మెంట్ సర్వీస్ కంపెనీ 'యాక్సిస్ సెక్యూరిటీస్' వెల్లడించింది. యాక్సిస్ సెక్యూరిటీస్ ప్రకారం.. వెండి రేటు మునుపెన్నడూ లేనంతగా పెరుగుతూనే ఉంది. 2025 ప్రారంభంలో రూ. 80వేలు వద్ద ఉన్న సిల్వర్ రేటు.. ఇప్పుడు గణనీయంగా పెరిగి, రెండు లక్షల రూపాయలు దాటేసింది. దీనికి కారణం మార్కెట్లో వెండికి పెరుగుతున్న డిమాండ్ అని స్పష్టమవుతుంది. ఆభరణాలుగా మాత్రమే కాకుండా.. పారిశ్రామిక రంగంలో వెండి వినియోగం పెరగడం, దీంతో డిమాండ్ ఎక్కువ కావడం వల్ల కూడా సిల్వర్ రేటు ఊహకందని విధంగా పెరిగింది. సోలార్ ఫోటోవోల్టాయిక్ రంగంలో మాత్రమే వెండి వినియోగం నాలుగేళ్లలో రెండింతలు పెరిగింది. రాబోయే రోజుల్లో కూడా వెండికి డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**ఈ రోజు వెండి ధరలు**

డిసెంబర్ 14న రూ. 2.10 లక్షల వద్ద ఉన్న కేజీ వెండి రేటు.. ఈ రోజు రూ. 2.13 లక్షలకు చేరింది. అంటే ఈ ఒక్క రోజులోనే సిల్వర్ టు రూ. 3000 పెరిగిందన్నమాట. హైదరాబాద్, విజయవాడ, ముంబై, బెంగళూరులో సిల్వర్ రేటు ఒకేలా ఉన్నా.. ఢిల్లీలో మాత్రం కొంత తక్కువగా ఉంది. ఇక్కడ కేజీ వెండి రేటు రూ. 2,00,900. దీన్నిబట్టి చూస్తే.. దేశంలో ఢిల్లీలోనే సిల్వర్ రేటు కొంత తక్కువని స్పష్టమవుతోంది.

## గ్రామీణ ఉపాధి పథకం...
# కొత్త పేరు ఇదే..




**ఢిల్లీ :** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం మారుస్తున్న సంగతి తెలిసిందే. ఆ పథకానికి వికసిత్ భారత్ జీ రామ్ జీ (గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్)) పేరును పెట్టింది. దీనికి సంబంధించిన బిల్లును పార్లమెంటులో సోమవారం ప్రవేశపెడుతోంది.

### బిల్లులోని ముఖ్యాంశాలు

ఇక నుంచి గ్రామ పంచాయతీల ద్వారా పనులకు ప్రణాళికలు. ప్రస్తుత పని దినాలు 100 నుంచి 125కు పెంపు. వ్యవసాయ సీజన్‌లలో కూలీల కొరత రాకుండా ఉపాధి పనులు 60 రోజుల వరకు తాత్కాలికంగా నిలిపివేసే వెసులుబాటు. వికసిత భారత్ లక్ష్యాలకనుగుణంగా రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిలో పనుల ప్రణాళికలు. వారానికోసారి కూలి చెల్లింపు తప్పనిసరి. ఏబీసీ కేటగిరీలుగా గ్రామ పంచాయతీల విభజన.కేంద్రం నిర్ధారించిన పారామీటర్స్ ఆధారంగా రాష్ట్రాల వారీగా ఉపాధి హామీ నిధులు కేటాయింపు. కేటాయింపునకు అదనంగా నిధులు ఖర్చు చేస్తే వాటిని భరించే బాధ్యత రాష్ట్రాలదే.

## చాట్‌జీపీటీ అడల్ట్ మోడ్..
# పెద్దల కోసం స్పెషల్ కంటెంట్!




దాదాపు అన్ని రంగాల్లోనూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హవా కొనసాగుతోంది. ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్స్ అందుబాటులోకి వస్తున్నాయి. ఈ తరుణంలో ఓపెన్‌ఏఐ పెద్దలకోసం 'అడల్ట్ మోడ్' అందించడానికి సిద్ధమైంది. ఇది ఎప్పటి నుంచి అంబాటులోకి వస్తుందనే విషయాన్ని ఆ సంస్థ సీఈఓ శామ్ ఆల్‌ట్‌మన్ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. అడల్ట్ మోడ్ ఫర్ చాట్‌జీపీటీ 2026 మొదటి త్రైమాసికంలో లాంచ్ కానుంది. కొత్త GPT5.2 మోడల్‌పై బ్రీఫింగ్ సందర్భంగా ఓపెన్‌ఏఐ అప్లికేషన్స్ సీఈఓ ఫిడ్జీ సిమో ప్రకటించారు. ఇది కేవలం వెరిఫైడ్ అడల్ట్స్ కోసం మాత్రమే. వయసు నిర్ధారణతోనే ఈ ఫీచర్స్ యాక్సెస్ లభిస్తుందని వెల్లడించారు. చాట్‌జీపీటీ అడల్ట్ మోడ్.. వినియోగం కేవలం పెద్దలకు మాత్రమే. దీనిని మైనర్లు ఉపయోగించుకుండా ఉండేందుకు సంస్థ తగిన ఏర్పాట్లు చేస్తోంది. కంపెనీ ప్రస్తుతం ఎంపిక చేసిన దేశాలలో వయస్సు అంచనాకు సంబంధించిన విషయాలను ధృవీకరించడానికి టెస్టింగ్ జరుగుతోందని సిమో పేర్కొన్నారు. అడల్ట్ మోడ్ ఖచ్చితంగా ఆప్ట్‌ఇన్ అయి ఉంటుంది. డిఫాల్ట్‌గా స్విచ్ ఆఫ్ చేయబడి ఉంటుంది. కంటెంట్‌ను అన్‌లాక్ చేయడానికి వినియోగదారులు స్పష్టంగా అభ్యర్థించి ధృవీకరణను పాస్ చేయాలి. అప్పుడే దీనిని ఉపయోగించుకోవడం సాధ్యమవుతుంది. ఈ మోడ్ పరిమితులకు లోబడి ఉంటుంది.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL


## కొద్ది రోజుల్లో ప్రళయం..
# ఘనా ప్రవక్త జోస్యం!



పుర్రెకో బుద్ధి.. జిహ్వకో రుచి అని సామెత. ఈయనగారి వ్యవహారం ఇంతకంటే ఎక్కువనే చెప్పాలి. ఎందుకంటే అప్పుడెప్పుడో బైబిల్‌లో చెప్పినట్టు ఈయనగారు కూడా ఒక ఆర్క్‌ను కట్టేస్తున్నాడు. ఆర్క్ అంటే ఏమిటని అనుకుంటున్నారా? ఇది బుక్ ఆఫ్ జెనిసిస్‌లోని ఓ గాథ. భూమ్మీద మనుషులందరూ స్వార్థంతో వ్యవహరిస్తున్నారని క్రీస్తు నోవా అనే భక్తుడికి ఓ నావను నిర్మించమని బాధ్యతను అప్పగిస్తాడు. నోవా, అతడి కుటుంబం కలిసికట్టుగా ఈ నావను నిర్మిస్తుంది. ప్రళయమొచ్చి భూమి మొత్తం నాశనమైపోతుంది. కానీ నోవా కుటుంబం, ఆ నౌక మాత్రం చెక్కు చెదరదు. నౌకలో దాచిన జంతువుల జంటలు, విత్తనాలతో ప్రపంచం మళ్లీ మొదలవుతుందని 'నోవాస్ ఆర్క్' కథ చెబుతుంది. సరిగ్గా ఇదే కథనాన్ని పోలినట్లు.. 'డిసెంబర్ 25 నుంచి భీకర వరదలు చుట్టుముట్టనున్నాయని.. ఇవి నాలుగేళ్లపాటు కొనసాగి ప్రపంచాన్నంతటికీ అల్లకల్లోలం చేయనున్నాయని.. ఈ విషయాన్ని దేవుడు తనకు చెప్పాడని ఆఫ్రికా దేశమైన ఘనాకు చెందిన స్వయం ప్రకటిత ప్రవక్త ఎబో నోహ్ చెబుతున్నాడు. తన భవిష్యవాణితో ఎబో జీసస్‌గా పేరొందిన ఈ ప్రవక్త ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. ఈ ప్రళయం నుంచి విశ్వాసులను, జంతువులను రక్షించడానికి పది భారీ చెక్క ఓడలను నిర్మించాలని దేవుడు తనకు ఆజ్ఞాపించాడని కూడా ఎబో నోహ్ తెలిపాడు. ఈ ఘనా ప్రవక్త హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటివరకు, ఎనిమిది భారీ ఓడల నిర్మాణం పూర్తయినట్లు తెలుస్తోంది. అతని హెచ్చరికలు బుక్ ఆఫ్ జెనిసిస్‌లోని కథనంలో పోలివుండటంతో దీనిపై చర్చజరుగుతోంది.

ఈ నేపథ్యంలో ఎబో నోహ్ ప్రవచనాలు, ఓడ నిర్మాణానికి సంబంధించిన వీడియోలు టిక్‌టాక్, యూట్యూబల్‌లలో విరివిగా వైరల్ అవుతున్నాయి.ఎబో నోహ్ అనుచరులు ఈ హెచ్చరికలను అందరికీ చెబుతున్నారు. అయితే ఎబో నోహను విమర్శించేవారు మాత్రం ఈ హెచ్చరికలను నమ్మడం లేదు. బైబిల్‌లో వర్ణించిన వరద ఘటన ఒకేసారి మాత్రమే జరిగిందని వారు అంటున్నారు. ఎబో నోహ్ ఎప్పటి నుంచో ఇలానే చెబుతూ వస్తున్నారని విమర్శిస్తున్నారు. కాగా ఘనా మత పెద్ద బిషప్ అబేద్ క్వాబెనా బోకియే అసియామా తదితరులు ఈ హెచ్చరికకు మద్దతు పలుకుతూ, వరద రాబోతోందనే భయంతో ఉన్న ప్రజలను జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కాగా ఎబో నోహ్ హెచ్చరికలకు శాస్త్రీయంగా ఎటువంటి ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు.

# బీచ్ అటాక్.. ఉగ్రవాది తల్లి సంచలన విషయాలు





ఆస్ట్రేలియా బీచ్‌లో ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడి 16మంది అమాయక ప్రజలను పొట్టన బెట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఘటనపై కాల్పులు జరిపిన ఉగ్రవాది తల్లి ఆసక్తికర విషయాలు తెలిపింది. కాల్పులు జరిపే కొద్ది సేపటి ముందు తన కుమారుడితో ఫోన్ మాట్లాడినట్లు పేర్కొంది. తన కుమారుడు తనతో ఎప్పటిలాగానే సాధారణంగా మాట్లాడాడని కొద్దిసేపటి తర్వాత తినడానికి వెళ్తానన్నాడని తెలిపింది. ఆస్ట్రేలియా సిడ్నీలోని బాండీ బీచ్‌లో ఆదివారం ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన సంగతి తెలిసిందే. హనుక్కా పండుగ జరుపుకుంటున్న యూదులపై సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్ అనే తండ్రికొడుకులు విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ఈ దుర్ఘటనలో 16మంది మరణించగా 40 మందికి గాయాలయ్యాయి. దాడి చేసిన వారు పాకిస్థాన్ దేశానికి చెందిన వారని కొద్దికాలం క్రితమే ఆస్ట్రేలియాకు వలస వచ్చారని అధికారులు తెలిపారు. అయితే తాజాగా ఈకాల్పుల ఘటనపై ఉగ్రవాది నవీద్ అక్రమ్ తల్లి స్పందించింది. కాల్పుల ఘటన జరగడానికి కొద్దిసేపటి ముందే అక్రమ్ తనతో మాట్లాడరని తెలిపింది. ఉగ్రవాది తల్లి వెరినా మాట్లాడుతూ "ఘటన జరగడానికి కొద్ది సేపు మందు నా కొడుకుతో మాట్లాడా అక్రమ్ చాలా సాధారణంగా మాట్లాడారు. కొద్దిసేపటి క్రితమే స్కూబా డ్రైవింగ్‌కు, స్విమ్మింగ్‌కు వెళ్లివచ్చాను. ఈ రోజు చాలా వేడిగా ఉంది హోటల్‌లోనే ఉంటాను. కొద్దిసేపు తర్వాత తింటాను " అని అక్రమ్ అన్నారని తన తల్లి పేర్కొంది. తన కొడుకు చాలా మంచివాడని అతనికి ఏలాంటి దురలవాట్లు లేవని, స్నేహితులతో కూడా ఎక్కువ తిరగడని తనకు పనికి వెళ్లడం ఇంటికి రావడం తప్ప మరేది తెలియదని ఆమె అంది. అ యితే తన కుమారుడి చిత్రాలను ప్రస్తుతం చూపిస్తున్న చిత్రాలతో సరిపోల్చలేమని తెలిపింది. నవీద్ అక్రమ్ సిడ్నీలోని హెకెన్‌బర్గ్ అల్ మురాద్ ఇనిస్టిట్యూట్‌లో ఖురాన్ సంబంధింత అధ్యయనాలని పూర్తి చేశాడు. 2024లో అక్కడే ఒక గృహాన్ని కొనుగోలు చేశాడు. ఇటీవల తన పని చేస్తున్న నిర్మాణ సంస్థ దివాళా తీయడంతో అతని ఉద్యోగం పోయినట్లు అతని తల్లి తెలిపింది.



## రన్నింగ్ ట్రాక్ కాదది..
# రూ.449 కోట్ల ఫ్లైఓవర్!

**బెంగళూరు:** బెంగళూరు నగరంలో రూ. 449 కోట్లతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఒక డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ కాస్తా రన్నింగ్ ట్రాక్‌గా మారిపోయింది. నగరంలోని హెచ్ఎస్ఆర్ లేఅవుట్, ఎలక్ట్రానిక్స్ సిటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రూ. 449 కోట్ల భారీ వ్యయంతో ఈ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మిస్తున్నారు. దాదాపు ఐదు కి.మీ పొడవున్న ఈ ఫ్లైఓవర్ దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌గా పేరొందింది. ఈ ఫ్లైఓవర్ మొదటి దశ (రాగిగుడ్డ నుండి హెచ్ఆర్ఎస్ లేఅవుట్‌కు) పనులు 2024 జూలై నాటికి పూర్తయ్యాయి. దీంతో సిల్క్ బోర్డ్ జంక్షన్ వద్ద రద్దీ కొంత మేరకు తగ్గింది. అయితే రెండవ దశ (హెచ్ఎస్ఆర్ నుండి రాగిగుడ్డ వైపు) నిర్మాణం పూర్తైనట్లు కనిపిస్తున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.ఈ జాప్యానికి భారీ ట్రాఫిక్ రద్దీ, పని గంటలపై విధించిన ఆంక్షలే కారణమని బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్)అధికారులు చెబుతున్నారు. కాగా ప్రారంభానికి నోచుకోని ఈ ఫ్లైఓవర్‌ను స్థానికులు తమ మార్నింగ్ జాగింగ్, వాకింగ్‌లకు ట్రాక్‌గా ఉపయోగిస్తున్నారు. స్థానికుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ 'ఈ ఫ్లైఓవర్ ప్రారంభానికి దాదాపు సిద్ధమైంది. అయితే యాక్సెస్ ర్యాంప్ ఇంకా సిద్ధం కాలేదు. అందుకే మేము కట్టే రోడ్డు టాక్స్‌ను సద్వినియోగం చేసుకునేందుకు దీనిపై రన్నింగ్ చేస్తున్నామన్నారు. అధికారికంగా వాహన రాకపోకలకు తెరుచుకోని ఈ ఫ్లైఓవర్ నగరంలో తాత్కాలిక వాహన రహిత రన్నింగ్ ట్రాక్‌గా మారిపోయింది. కాగా బీఎంఆర్‌సీఎల్ అధికారులు మాట్లాడుతూ ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలోని మిగిలిన 10శాతం పనులు త్వరలోనే పూర్తిచేసి, 2026 జనవరి చివరి నాటికి అందుబాటులోకి తెస్తామంటున్నారు.

# శబరిమలలో ముమ్మరంగా ఆహార భద్రతా శాఖ తనిఖీలు

శబరిమలకి వచ్చే భక్తుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆహార భద్రతా శాఖ తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. భక్తులకు నాణ్యమైన ఆహారం అందేలా పంబా, సన్నిధానంలలో పనిచేస్తున్న ప్రత్యేక ఆహార భద్రతా బృందాలు ఆహార సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో పంబలో 328 , సన్నిధానంలో 302 తనిఖీలు పూర్తయ్యాయి. పంబలో లోపాలు గుర్తించిన సంస్థలపై 6 కాంపౌండ్ ఫుడ్ నోటీసులు, 21 సవరణ నోటీసులు జారీ చేశారు. సన్నిధానంలోని 24 సంస్థలకు సవరణ నోటీసులు పంపించారు. మొత్తం ఆరు ఫిర్యాదులు పరిష్కరించబడగా , కాంపౌండ్ ఫుడ్ విధానం ద్వారా నాలుగు సంస్థల నుంచి రూ.30,000 జరిమానా వసూలు చేశారు. పంబ, సన్నిధానంలోని ఆహార వ్యాపారులకు ఆహార సరఫరా సంబంధిత అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ప్రాథమిక నాణ్యత పరీక్షల కోసం పంబాలో 69 ఆహార నమూనాలు, సన్నిధానంలో 62 ఆహార నమూనాలను పరీక్షలకు పంపించారు. ఆహార భద్రతకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్లను అన్ని సంస్థల్లో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో కూడా తనిఖీలు కొనసాగుతాయని ఆహార భద్రతా అధికారులు తెలిపారు. కాగా, సరిగ్గా మూడేళ్ల క్రితం శబరిమల అయ్యప్పస్వామి అరవణ పాయసంలో వాడే యాలకుల్లో పురుగు మందు అవశేషాలున్నట్లు తేలడం తోపాటు ఇటీవల అయ్యప్పస్వామి అభిషేకానికి, ప్రసాదాల తయారీకి ఉపయోగించే తేనెలో సైతం లోపాలున్నట్లు విజిలెన్స్ తేల్చడం తదితర కారణాల రీత్యా శబరిమలలో ఆహారభద్రతా శాఖ తనిఖీలు ముమ్మరంగా చేపట్టింది.



